



సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

గురువారం| 09 అక్టోబరు 2025

పేజీలు 8




సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

# వేగంగా ప్రధాని సభ ఏర్పాట్లు



ప్రధాని సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి

- 11 ప్రదేశాల్లో పార్కింగ్
- వివిపిల కోసం 10 పడకల ఆసుపత్రి
- ప్రజల కోసం 20 పడకల ఆసుపత్రి
- సమీక్షించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- పరిశీలించిన మంత్రి టీజీ.భరత్, జిల్లా కలెక్టర్ ఏ.సిరి

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16వ తేదీన కర్నూలులో పర్యటించనున్న నేపథ్యంలో నిర్వహిం చబోతున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నగర శివార్లలోని రాగమ యూరి గ్రీన్‌హిల్స్ వద్ద 3 లక్షల మందితో సభ నిర్వహించబోతున్న విషయం తెలిసిందే. జీఎస్టీ సంస్కరణ నేపథ్యంలో ప్రజలపై తగ్గనున్న పన్నుల భారాన్ని తెలియజేసేందుకు ప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కర్నూలుకు రానున్నారు. ప్రధాని సభ ఏర్పాట్లు జరుగుతున్న తీరును ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్షించారు. సభ ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ ఏ.సిరి బుధవారం పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ శ్రీశైలంలోనూ పర్య టించబోతున్నారు. శ్రీశైలంలో శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకోవడంతో పాటు శివాజీ స్ఫూర్తి కేంద్రానికి కూడా మోదీ వెళ్లనున్నట్లు సమాచారం. శివాజీ స్ఫూర్తి కేంద్రానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒకసారి సందర్శించుకోగా, ప్రధాని రానుండడం ఇదే ప్రథమం. ఇందుకోసం శ్రీశైలంలోనూ పెద్ద ఎత్తున

మిగతా 2లో



ప్రధాని సభా వేదిక వద్ద అంతర్గత రహదారుల నిర్మాణం



సభ వేదిక ఏర్పాటు జరుగుతున్న దృశ్యం



పూర్తయిన తాత్కాలిక కార్యాలయం



సభా స్థలి వద్ద వద్ద వేగంగా జరుగుతున్న పనులు

## పకడ్బందీగా భద్రత ఏర్పాట్లను చేయాలి

- డ్రోన్ కెమెరా,రూట్ మ్యాప్‌లతో ఏర్పాట్లు పరిశీలన
- ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన అడిషనల్ డిజి మధుసూధన్‌రెడ్డి, ఐజి, డిఐజిలు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** కర్నూలులో ప్రధాని మోడీ ఈ నెల 16న పర్యటిస్తున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై అడిషనల్ డిజి మధుసుధన్ రెడ్డి ఐపిఎస్ పకడ్బందీ భద్రత ఏర్పాట్లు చేయాలని ఆయా పోలీసు అధికారులకు సూచించారు. బుధవారం మోడీ పర్యటన ఏర్పాట్లపై కర్నూలు, ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు దగ్గరున్న ఏరో వన్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిజి మొదటగా గూగుల్ రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తూ ఓర్వకల్లు మండలం, నన్నూరు దగ్గరున్న రాగమయూరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ తదితర ప్రదేశాల గురించి పర్యటన వివరాలను కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌లను అడిగి తెలుసుకున్నారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, హెలిప్యాడ్, బహిరంగ సభ, వాహనాల డైవర్షన్‌లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

## ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులు

- ప్రైవేటు పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం
- రాష్ట్ర న్యాయ,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్



ప్రైవేట్ పాఠశాలల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల కల్చరల్, మేజర్ న్యూస్ :** ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులు అని విద్యార్థుల వృద్ధికి అంకితభావం క్లిష్ట పరిస్థితుల్లోను అభ్యాస విజయాలను నేర్పుతూ విద్యార్థులను తీర్చిదిద్దడానికి పునాది ఉపాధ్యాయులు అని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌కే ఫంక్షన్ హాలులో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరవ్హించిన ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ఫంక్షన్‌కు

మిగతా 2లో

## డ్రైవర్ పై ప్రయాణికుడు దాడి

- డ్రైవర్ పై దాడిపట్ల నిరసనగా డ్రైవర్లు విధుల బహిష్కరణ
- బస్సులు ఆగిపోవడంతో ప్రయాణికుల ఇక్కట్లు
- డ్రైవర్ పై దాడిని ఖండించిన రీజినల్ మేనేజర్ రజియా సుల్తానా



2లో

ప్రైవేటు ఆర్టీసీ డ్రైవర్లు నిరసన నిర్వహిస్తున్న దృశ్యం

## రెడ్‌క్రాస్ వర్సెస్ ఐఎంఏ

- నంద్యాల జిల్లా స్పెషల్
- దస్తగిరికి రెండవ సారి పగ్గాలు
- రెడ్‌క్రాస్‌లో భాగస్వామ్యం కావద్దని ఐఎంఏ ఒత్తిళ్లు..!
- కమిటీ నుంచి తప్పుకునే ఆలోచనలో వైద్యులు
- ఆర్యవైశ్య దాతకు మొండిచెయ్యి
- ఆర్‌ఎంపి పాలనలో రెడ్‌క్రాస్..!
- టీడీపీకి మొండి చెయ్యి..వైసీపీకి అందలం




2లో

నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న డీఆర్‌వో రాము నాయక్

సూర్య



# వేగంగా ప్రధాని సభ ఏర్పాట్లు

(మొదటి పేజి తరువాయి)

ఏర్పాట్లు జరుగుతున్నాయి. కర్నూలులో భారీ బహిరంగసభకు ఉమ్మడి జిల్లా నుండే కాకుండా పక్క జిల్లాల నుండి కూడా జనాన్ని సమీకరించే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రజలను బస్సుల్లో బహిరంగ సభకు తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో వాహనాలు సభా ప్రాంగణం వద్దకు రానుండడంతో 11 స్థలాల్లో పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. బస్సులతో పాటు వివిఐపి, విఐపిల వాహనాల సంఖ్య కూడా భారీగా రానుండడంతో ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 100 ఎకరాల స్థలంలో జంగిల్‌క్లియరెన్స్ దాదాపు పూర్తి చేశారు. అంతర్గత రోడ్ల నిర్మాణం ప్రారంభమైంది. ఇక, విఐపిల కోసం 10 పడకల ఆసుపత్రి, ప్రజల కోసం 20 పడకల ఆసుపత్రి నిర్మిస్తున్నారు. బేసిక్ లైన్స్ అంబులెన్స్‌లు, అవసరమైన మందులు, స్ట్రెచర్లు, వీల్‌చైర్లు, ఎమర్జెన్సీ మెడికల్ టీం, మెడికల్ పరికరాలు అందుబాటులో ఉంచబోతున్నారు. అలాగే మొబైల్ టాయ్‌లెట్స్‌ను కూడా సభా స్థలి వద్ద ఏర్పాటు చేస్తున్నారు. హెలిప్యాడ్ నిర్మాణం, బ్యారికేడింగ్, సిసి కెమెరాల ఏర్పాటు లాంటి అంశాలను సకాలంలో పూర్తి చేసేందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు జరుగుతున్నాయి. వందలాది మంది కార్మికులు బహిరంగసభా స్థలిలో పని చేస్తున్నారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూసేందుకు పోలీసు వ్యవస్థ పని చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఒకేరోజు శ్రీశైలం, కర్నూలులో ప్రధాని మోదీ పర్యటించనున్న నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుండి పోలీసులను రప్పిస్తున్నారు. సిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, టి.జి.భరత్, బిసి జనార్ధన్‌రెడ్డి ఇప్పటికే ఒకసారి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. బిసి జనార్ధన్‌రెడ్డి నంద్యాల నుండి రెండు జిల్లాల్లో పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రధాని మోదీ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో ఎక్కడా చిన్న లోపం జరగకూడదన్న దిశలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# పకడ్బందీగా భద్రత ఏర్పాట్లను చేయాలి

(మొదటి పేజి తరువాయి)

తదితర విషయాల గురించి అడిషనల్ డిజి, ఐజి, డిఐజిలకు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ వివరించారు. ప్రధాని మోడీ పర్యటించే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను అడిషనల్ డిజి ఆదేశించారు. అడిషనల్ డిజి మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ కానిస్టేబుల్ స్థాయి నుండి ఆపై స్థాయి అధికారులను మాత్రమే ప్రధాని పర్యటన బందోబస్తు విధులకు కేటాయించాలన్నారు. విధులు కేటాయించిన పోలీసు అధికారులు మానిటరింగ్ చేస్తూ పూర్తి బాధ్యత వహించాలన్నారు. అనంతరం ఓర్వకల్లు, నన్నూరు దగ్గరున్న రాగమయూరిలో పర్యటించి భద్రత ఏర్పాట్లను డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలన చేశారు. ఈ సమావేశంలో ఐజి శ్రీకాంత్, డిఐజీలు కోయ ప్రవీణ్, సెంథిల్ కుమార్, సత్యయేసు బాబు, పక్కీరప్ప, కాగినెల్లి, ఎస్పీలు విక్రాంత్ పాటిల్, షెల్కే నచికేత్ విశ్వనాథ్, కృష్ణకాంత్, మణికంఠ, చందవోలు, దేవరాజ్, ధీరజ్ కునుబిల్లి, దీపికాపాటిల్, ట్రైనీ ఐపిఎస్‌లు, అడిషనల్ ఎస్పీలు కృష్ణమోహన్, డిఎస్పీలు, ఇంటెలిజెన్స్ అధికారులు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



రూట్‌మ్యాప్‌లను పరిశీలిస్తున్న అడిషనల్ డిజి. మధుసుధన్



పాల్గొన్న అధికారులు

# ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులు

(మొదటి పేజి తరువాయి)

ముఖ్య అతిథిగా మంత్రి ఎన్ఎండి ఫరూక్, ప్రైవేట్ పాఠశాలల చైర్మన్, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలు హాజరయ్యారు. ఈకార్యక్రమానికి నంద్యాల జిల్లా అధ్యక్షులు బిజ్జం సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడు తూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు మాత్రమే ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను ప్రధానం చేస్తున్నదని దాని ఆధారంగా తీసుకుని ప్రైవేట్ పాఠశాలల్లో మంచి బోధన చేసే వారిని కూడా ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించాలనే ఉద్దేశంతో ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఈ అవార్డులు ఇవ్వడం మంచి పరిణామం అన్నారు. ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు పొందిన వారికి అభినందనలు తెలిపారు. వినూత్న బోధనా పద్ధతులలో విద్యార్థుల వృద్ధికి అంకితభావం, క్లిష్ట పరిస్థితుల్లోను అభ్యాస విజయాలను పెంపొందంలో స్ఫూర్తిదాయకమైన బోధన వంటి విషయాల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఉత్తమ అవార్డుల ప్రధానోత్సవంలో గుర్తింపు దక్కిందన్నారు. ఉపాధ్యాయులకు ఏదైనా సమస్య లు ఉంటే నా దృష్టికి తేవాలని వాటిని ఖచ్చితంగా పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రవేట్ పాఠశాలల లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఉత్తమ అవార్డు పొందిన వారిని మెమోంటోతో సన్మానిం చారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తులసి విష్ణుప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు రమణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుధాకర్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, రావూస్ విద్యాసంస్థల చైర్మన్ అప్పారావు, కేశవరెడ్డి విద్యాసంస్థల అధినేత నాగిరెడ్డి కేశవరెడ్డి, వెంకటస్వామి, వికాస్‌వలి, ఇషాక్‌వలి, తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేట్ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానం చేస్తున్న దృశ్యం

# అద్దె బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** అద్దె బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బుధవారం కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్ వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయు నాయకులు సుధాకర్, అద్దె బస్సుల యూనియన్ డిపో సెక్రటరీ వెంకటేష్‌లు మాట్లాడుతూ ఆళ్ళగడ్డ డిపోకు సంబంధించిన అద్దె బస్సు డ్రైవర్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. నిరుద్యోగ యువత మంచి చదువులు చదువుకొని ఉద్యోగాలు లేక ప్రైవేటు డ్రైవర్లుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించడం జరుగుతుందని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం వారికి రక్షణ కల్పించాలని, ఆర్టీసీ యాజమాన్యం రూల్స్ ప్రకారం డ్రైవర్లు ప్రయాణీకులను ఎక్కించుకోవడం జరుగుతుందని, కానీ ప్రయాణీకులు పరిమితికి మించి బస్సు ఎక్కుతుండటంతో డ్రైవర్లు కంట్రోల్ చేస్తే వారిపైనే దాడి చేయడం జరుగుతుందని అన్నారు. దీని వల్ల ప్రయాణీకులకు ఏ ప్రమాదం జరిగినా డ్రైవరే కారకుడవుతున్నారని అన్నారు. వారికి వచ్చే అరకొర జీతాలతో ఇటు ఆర్టీసీ వారితో పాటు అటు ప్రయాణీకులతో అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉద్యోగాలు చేస్తున్నారని, వారికి ఆర్టీసీ యాజమాన్యం నుంచి ఎటువంటి జాబ్ సెక్యూరిటీగానీ, రక్షణగాని లేదని అన్నారు. డ్రైవర్లపై ఇలాంటి దాడులు జరగకుండా దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని అన్నారు. మహేష్, రాజు, బుజ్జి, చెన్నయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.



# డ్రైవర్ పై ప్రయాణికుడు దాడి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోహైర్ బస్సు డ్రైవర్ మహమ్మద్ పై మంగళవారం ప్రయాణికుడు దాడి చేయడం జరిగింది. బస్సు ఆపలేదన్న కోపంతో డ్రైవర్ పై ప్రయాణికుడు దాడి చేయడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఆళ్లగడ్డ నుండి మైదుకూరుకు బస్సు వెళుతున్న సమయంలో దువ్వూరు వద్ద బస్సు ఆపకపోవడంతో దాడి చేయడం జరిగింది. బస్సులో ప్రయాణికులు పరిమితికి మించి అధిక సంఖ్యలో ఉండడంతో బస్సు ఆపలేదని డ్రైవర్ చెప్ప డం జరిగింది. విషయం చెప్పినప్పటికీ ప్రయాణికుడు డ్రైవర్ పై దాడి చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా హెయిర్ డ్రైవర్ పై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని, నాన్బెయిలబుల్ కేసు నమో దు చేయాలని సిఐటియు కార్యదర్శి తాళ్ల శ్రీనివాసులు ఆధ్వర్యం లో హెయిర్ బస్సు డ్రైవర్ల సంఘం డిమాండ్ చేస్తూ బుధవారం నిర సనకు దిగి విధులను బహిష్కరించారు. బస్సులు తిరగకపోవడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడ్డారు. డ్రైవర్లకు మద్దతుగా కోవెలకుంట్ల, నంద్యాల, నందికొట్కూరు తదితర ఆర్టీసీ డిపో హైర్ బస్సు డ్రైవర్లు విధులను బహిష్కరించడంతో బస్సులు ఆగిపోయా యి. విషయం తెలిసిన వెంటనే ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రజియా సుల్తానా ఆళ్లగడ్డకు వచ్చి సమాచారాన్ని సేకరించడం జరిగింది. బాధితుడికి అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. డ్రైవర్ పై దాడి చేసిన వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసేంతవరకు తాము విధులకు ఎక్కేది లేదని హైర్ బస్ డ్రైవర్లు ఖరా ఖండిగా చెప్పారు.

# రెడ్‌క్రాస్ వర్సెస్ ఐఎంఏ

**నంద్యాల,మేజర్‌న్యూస్‌బ్యూరో :** నంద్యాల జిల్లాలో రెడ్‌క్రాస్, ఐఎంఏకు మధ్య కోల్డ్‌వార్‌కు తెరలేచింది. రెడ్‌క్రాస్‌లో భాగస్వామ్యం కావద్దని ఐఎంఏ నుంచి వైద్యులకు ఒత్తిళ్లు మొదలయ్యాయి. నంద్యాల జిల్లా నూతన కమిటీలో భాగస్వామ్యులైన వైద్యులు తప్పుకునే ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. నంద్యాల జిల్లాగా ఏర్పడి మూడేళ్ళు గడిచినా ఇంకా కర్నూలు జిల్లా పెత్తనం సాగుతుంది. ఆర్ఎంపీ పాలనలో రెడ్‌క్రాస్‌గా మారిపోయింది. ఆర్యవైశ్య దాతకు కమిటీలో చోటు కల్పించకుండా ఓ ఆగ్రకుల నాయకుడు చక్రం తిప్పారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎన్నో పరిణామాల మధ్య గత అధ్యక్షుడు దస్తగిరి మరోసారి పగ్గాలు అందుకున్నారు. రాష్ట్రంలో దాదాపు ప్రతి జిల్లాలో న్యాయకత్వ మార్పు చోటు చేసుకున్నా నంద్యాలలో రెండవ సారి దస్తగిరికి అధికారులు అవకాశం కల్పించారు. నూతన జిల్లా కమిటీలో టీడీపీకి మొండి చెయ్యి ఇచ్చారు. ప్రతిపక్ష వైసీపీ నాయకులను అందలం ఎక్కించడం చకచకా జరిగిపోయిన నేపథ్యంలో "మేజర్ న్యూస్" అందిస్తున్న కథనం ఇది.. నంద్యాల జిల్లా కేంద్రంలోని వైఎస్ఆర్ సెంచురీ హాల్‌లో నంద్యాల జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. డీఆర్‌వో రాము నాయక్ నూతన కమిటీని ప్రకటించారు. చైర్మన్‌గా దస్తగిరి, వైస్ చైర్మన్‌గా డాక్టర్ మమతారెడ్డి, కోశాధికారిగా నాగేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన మేజ్‌మెంట్ కమిటీలో వైద్యులు ఆరిఫాభాను, నిషితారెడ్డి, నెరవాటి అరుణ్‌కుమారితో పాటు ఉస్మాన్‌బాష, నరసింహమూర్తి, రాధాకృష్ణయ్య, నాగశేషయ్య, యాకోబ్‌లు సభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ తరుపున రాష్ట్ర కోశాధికారి రామచంద్రరాజు పరిశీలకులుగా హాజరయ్యారు. కర్నూలు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ కేజీ గోవిందరెడ్డి, ప్రస్తుత రెడ్‌క్రాస్ కార్యదర్శి ఏవో సుబకర్, జిల్లా కోఆపరేటీవ్ డివిజన్ అధికారి (ఎన్నికల అధికారి) జానకీరాముడు, సబ్‌రిజిస్టర్ వెంకట సుబ్బయ్యలు హాజరయ్యారు. చైర్మన్ దస్తగిరి, కోశాధికారి నాగేశ్వరరావులు ఆర్ఎంపీ వైద్యులుగా ఉన్నారు. మరో ఆర్ఎంపీ వైద్యుడు నాగేశ్వరరెడ్డి కుమార్తె డాక్టర్ మమతారెడ్డి వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇక్కడి వరకు నాణెంకు ఒకవైపు కనిపిస్తుండగా నాణెంకు మరో వైపు రెడ్‌క్రాస్‌లో సభ్యులుగా ఉన్న వైద్యులు భాగస్వామ్యం కావద్దని జిల్లా ఐఎంఏ నుంచి ఒత్తిళ్లు మొదలైనట్లు తెలుస్తోంది. ఐఎంఏలో సభ్యులుగా ఉన్నవారు రెడ్‌క్రాస్‌కు దూరంగా ఉండాలని సూచించినట్లు తెలుస్తోంది. నంద్యాల జిల్లా రెడ్‌క్రాస్ ఆర్ఎంపీ చేతుల్లోకి వెళ్లిపోయిందని ఐఎంఏలోని కొందరు బహిరంగంగానే చెబుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు వైస్ చైర్మన్‌గా ఉన్న ఆర్యవైశ్య దాత సెవెన్‌హిల్స్ హాస్పిటల్ అధినేత రెంటాల మారుతికుమార్‌ను వ్యూహాత్మకంగా పక్కకు తప్పించినట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాకు చెందిన ఓ ప్రముఖ రెడ్‌క్రాస్ ప్రతినిధి మారుతి కుమార్‌ను తప్పించడంలో కీలక పాత్ర పోషించినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ప్రస్తుత కమిటీలో ప్రతిపక్ష వైసీపీలో కీలకంగా ఉన్న ముగ్గురికి చోటు దక్కింది. టీడీపీ నాయకులను ఒకరిద్దరిని పక్కన పెట్టారు. అసంతృప్తులను సంతృప్తి పరచడంలో భాగంగా ఎక్స్ అఫిషియో సభ్యులుగా చేర్చనున్నట్లు నూతన కమిటీ ప్రకటన సమయంలో ప్రకటించడం కొసమెరుపు.



మాజీ వైస్ చైర్మన్ రెంటాల మారుతికుమార్

# అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలు ప్రారంభం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలను బుధవారం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 6 నుండి 10 వరకు వారోత్సవ దినాలను పురస్కరించుకొని ఆళ్లగడ్డ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో బదిరుల అవగాహన సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. పిల్లలకు వినికిడి లోపం రాకుండా పురిటి దశ నుండే తీసుకోవలసిన జాగ్రత్తల గురించి గర్భిణీలకు వివరించారు. పసి పిల్లలకు చెవిలో ఇన్ఫెక్షన్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆమె వివరించారు. వినికిడి లోపాన్ని త్వరగా గుర్తించాలన్నారు. బధిరుల పట్ల సానుభూతి కలిగి ఉండాలని, సంకేత భాష హక్కులు లేకుండా మానవ హక్కులు లేవు ఉన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, గర్భవతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సుజాత

# జీఎస్టీ తగ్గడం ప్రజలకు ఉపశమనం – రేడియం నూర్

**– జిఎస్టి 2.0పై ప్రజలకు అవగాహన కల్పించిన రేడియం నూర్**



జిఎస్టి తగ్గడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న టిడిపి సీనియర్ నాయకులు రేడియం నూర్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** దేశవ్యాప్తంగా గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ తగ్గింపు నిర్ణయాన్ని కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవడం వల్ల పేద , మధ్య తరగతి వారితో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఉపశమనం కలిగించిందని టిడిపి సీనియర్ నాయకులు రేడియం నూర్, సింగిల్ విండో చైర్మన్ షాబుద్దీన్‌లు అన్నారు. బుధవారం జిఎస్టి తగ్గింపు వలన ప్రజలకు ఎలాంటి ఉపయోగం ఉందో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేడియం నూర్, షాబుద్దీన్‌లు మాట్లాడుతూ జిఎస్టి తగ్గించి పేద , మధ్య తరగతి ప్రజలకు కూటమి ప్రభుత్వం సూపర్ గిఫ్టు ఇచ్చిందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఏపి ప్రజలకు డబుల్ బెనిఫిట్స్ ఇస్తు సుపరిపాలనతో ముందుకు వెళ్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు నిత్యావసర వస్తువులు, గృహోపకరణలు, చిన్న వ్యాపారాలపై జిఎస్టి ధరలు తగ్గించింద న్నారు. దీని వల్ల మార్కెట్‌లో ధరలు కొంత మేర తగ్గడంతో వినియోగదారులపై భారం తగ్గిందని అన్నారు. ప్రధానంగా విద్యుత్ పరికరాలు, గృహ వినియోగ వస్తువులు, రెస్టారెంట్ సేవలు, చిన్న వ్యాపారుల ఉత్పత్తులపై జిఎస్టి ప్రభావం స్పష్టం కనిపిస్తుందన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు నెలసరి ఖర్చులు తగ్గడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. జిఎస్టీ తగ్గింపుతో వినియోగ దారుల కొనుగోలు శక్తి పెరుగుతుందని చిరు వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. జఎస్టి తగ్గింపుతో చేయడంతో కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు సరుకులు పంపిణీ

**– ఆవు దూడ వంకకు ఇరువైపులా సైడ్ గోడ ఏర్పాటు చేయాలి**

**– అమరావతి నగర్‌లో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలంటూ, కమీషనర్‌కు వినతి**



ఆదోని, మేజర్ న్యూస్ : ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని అమరావతి నగర్‌లోని 35వ వార్డు పరిధిలో ఇటీవల కురిసినభారీ వర్షాలకు పంజారపోల్ కాలనీ ఇళ్లలోకి నీరు ప్రవేశించి తిండిగింజలు, బట్టలు ఇంట్లోని సామాన్లు తడిసిపోయి నష్టపోయిన పేద కుటుంబాలకు ఎమ్మెల్యే డాక్టర్ పి.వి. పార్థసారధి ఆదేశాల మేరకు దాదాపు రూ.వెయ్యిలు విలువ చేసే నిత్యావసర సరుకులను కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ సొంత ఖర్చులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, వర్షాలు వచ్చినప్పుడు మా వార్డులోని పంజారాపోల్ కాలనీ అనుకొని ఉన్న ఆవుదూడ వంక విపరీతమైన ప్రవాహం వస్తుందని, అటువంటి సమయంలో ఇళ్లలోకి నీరు ప్రవహించడమేకాకుండా రోడ్లపైన రెండు మీటర్ల నీరు ప్రవహించి ప్రజలు బయటకు వచ్చే పరిస్థితి ఉండదని దయ చేసి మున్సిపల్ కమీషనర్ వెంటనే స్పందించి ఆవుదూడ వంకకు సైడ్ గోడ, అమరావతి నగర్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పరుశురాం, జమ్మన్న, తిక్కన్న, నాగేష్, తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

# నేడు జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం కళా వెంకట్రావు భవనంలో నేడు కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కర్నూలు జిల్లా కాంగ్రెస్ ఇంచార్జ్, నంద్యాల డిసిసి అధ్యక్షులు, ఏఐసిసి సభ్యులు జె లక్ష్మి నరసింహ యాదవ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐసిసి కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ గణేష్ కుమార్ యాదవ్, ఏపిసిసి వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్, ఉత్తరాంధ్ర జిల్లాల ఇంచార్జ్ మస్తాన్ వలిలు హాజరవుతారన్నారు. సమావేశం అనంతరం కర్నూలు జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియో జకవర్గ నాయకులతో విడిగా సమావేశాలు నిర్వహించి నాయ కులు, కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకుని పార్టీలో కీలక పదవు లు, జిల్లా, మండల కమిటీల ఏర్పాటు, జిల్లా కాంగ్రెస్ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ చేపట్టవలసిన ప్రణాళిక గురించి చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని ప్రతి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రతినిధులు, ఏఐసిసి, పిసిసి సభ్యులు,నియో జకవర్గాల కోఆర్డినేటర్లు, చైర్మన్లు, డిసిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని కోరారు.

# నగరపాలక సిబ్బందికి స్టేషనరీ పంపిణీ

**కర్నూలు(కెఎంసి), మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ కార్యాలయంతో పాటు వివిధ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి అవసరమైన స్టేషనరీ సామాగ్రిని బుధవారం మేనేజర్ యన్ చిన్నరాముడు పంపిణీ చేశారు. కార్యాలయ కార్యకలాపాలు సమర్థవంతంగా సాగేందుకు స్టేషనరీ సరఫరా కీలకమని ఆయన పేర్కొన్నారు. సిబ్బంది సౌకర్యాలను మెరుగు పరచడం ద్వారా సేవల నాణ్యతను పెంపొందించవచ్చని ఆయన అన్నారు. సిబ్బంది పనితీరును మరింత బలోపేతం చేయడానికి అవసరమైన అన్ని రకాల సదుపాయాలను దశలవారిగా అందిస్తున్నామని తెలిపారు. కార్యాలయ పనుల్లో వేగం, కచ్చితత్వం పెంచడం లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. స్టేషనరీ దుర్వినియోగం చేయరాదని మేనేజర్ సూచించారు.



స్టేషనరీని అందచేస్తున్న మేనేజర్ చిన్నరాముడు

# రాజ్యాంగం నుంచి లౌకిక –స్వామ్యవాదం పదాలను తొలగించరాదు

**– జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్**



సంఘీభావం తెలుపుతున్న జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ ఐక్యవేదిక నాయకులు

నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ : రాజ్యాంగం నుంచి లౌకిక–స్వామ్యవాదం పదాలను తొలగించరాదని జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బొమ్మలసత్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై సనాతన న్యాయవాది రాకేష్ కిషోర్ బూటు విసిరిన అమానుశ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని నినాదాలు చేశారు. ఈ దుష్చర్యను దేశ ప్రజాస్వామ్య–లౌకిక వాదులు ముక్తకంఠంతో ఖండించాలని అన్నారు. రాజ్యాంగం నుంచి లౌకిక–స్వామ్యవాదం పదాలు తొలగించరాదన్న డిమాండ్‌తో నేడు విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టుతున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో లౌకిక–స్వామ్య వాదులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ ఐక్యవేదిక నాయకులు బాబాఫకృద్దీన్, అబులైస్, సాంబశివుడు, మరియదాస్, అనీల్ అమృతరాజ్, నరసయ్య యాదవ్, సోమన్న, వడ్డె సురేష్, మహమ్మద్ షఫీ, డొక్కా చింతలయ్య, శ్రీనివాసులు, జీవన్‌రాజ్, అంబేద్కర్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

# నవంబరు 12న ఆర్‌యూలో కాన్వోకేషన్



రాయలసీమ యూనివర్సిటీ

**కర్నూలు విద్య, మేజర్‌న్యూస్ :** రాయలసీమ యూనివర్సిటీ 4వ కాన్వోకేషన్ నవంబరు 12వ తేదీన వర్సిటీలో నిర్వహించనున్నట్లు వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ వి వెంకట బసవరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరవుతారని చెప్పారు. 2021-22, 2022-23, 2023-24, 2024-25సంవత్సరాల్లో యూనివర్సిటీ పరిధిలో యూజీ, పీజీ, బిఈడి, బిపిఈడి, ఎల్ఎల్‌బి, ఎంబిఏ, ఎంసిఏ కోర్సులు పూర్తి చేసుకుని ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు వారి విద్యార్హత పట్టాలను కాన్వోకేషన్ సభలో పొందవచ్చన్నారు. ఇప్పటికే కాన్వోకేషన్‌కు సంబంధించి రెండుసార్లు నోటిఫికేషన్ విడుదల చేశామని, విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని ఆయన చెప్పారు. యూజీ విద్యార్థులు 9404, పీజీ, ఇతర ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులు 420మంది, పిహెచ్ విద్యార్థులు 148మంది దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు. ఈ కాన్వోకేషన్‌లో 70 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రధానం చేయనున్నట్లు వైస్ చాన్స్‌లర్ వెంకట బసవరావు తెలిపారు.

# అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోకూడదు

**– అడ్వకేట్ క్రాంతి నాయుడు**



**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయని అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోకూడదని వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, అడ్వకేట్ క్రాంతి నాయుడు ప్రశ్నించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓఆర్‌టి 390ప్రకారం మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర స్థాయి అధికారిక వేడుకగా ఘనంగా నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. అయితే పోలీస్, రెవెన్యూ, ఎంపిడిఓ, సచివాలయం, పంచాయతీ అధికారులు ప్రభుత్వ ఆదేశాలను విస్మరించి వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించకపోవడం చట్ట విరుద్ధమన్నారు. ఇది కేవలం వాల్మీకి బోయ సమాజాన్ని వాల్మీకి బోయ సమాజాన్ని అవమానపరచడమే కాదు ప్రభుత్వ అధికారాన్ని తక్కువగా అంచనా వేసే చర్యగా పరిగణించాలన్నారు. జిల్లాలోని అధికారులపై ఎందుకు కేసులు నమోదు చేయకూడదని డిఈఓ శామ్యూల్ పాల్‌కి వాల్మీకి బోయ సంఘం తరపున అడ్వకేట్ క్రాంతి నాయుడు నోటీస్ ఇవ్వడం జరిగింది. అలాగే కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లా కలెక్టర్, ఎస్పీలకు కూడా నోటీస్‌లు పంపి వివరణ కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా అధ్యక్షులు వాల్మీకి అర్జున్, పులి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలి



గృహాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మంత్రాలయం మండల కేంద్రంలో వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర నూతనంగా నిర్మించిన రాయరభీమ రెసిడెన్సీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్పి నేత ప్రదీప్‌రెడ్డి, మండల అధ్యక్షులు భీమారెడ్డి, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్సిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ముందుగా పులికుక్క రాఘవేంద్ర, ప్రదీప్‌రెడ్డికి ఘన స్వాగతం పలికి రిబ్బన్ కట్ చేసి సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి పూలమాలలు, శాలువలు కప్పి సన్మానించారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థికసహాయం అందజేస్తున్న శివస్వాములు

**కోసిగి మేజర్ న్యూస్:** అనారోగ్యంతో మృతిచెందిన కుటుంబానికి శివమాల దరించేవారు ఆర్థికసహాయంను అందజేయడం జరిగింది. మంగళవారం కోసిగిలోని కడాపాలెం వీధిలో ఉన్న కమ్మరి వీరేషాచారి అనారోగ్యంతో మృతిచెందడం జరిగింది. గత కొన్నిరోజు లుగా అనారోగ్యానికి గురికావడంతో మంగళవారం మృతిచెందినట్లు భార్య లక్ష్మీదేవి తెలిపారు. అయితే ఈవిషయం తెలుసుకున్న శివసాముల బృందం చేయిచేయి కలిపి తమవంతు ఆర్థికసహాయంను అందజేయడం జరిగింది. 23సంవత్సరాలుగా మాతోపాటు శివమాల ధరించి గురువుగా ఉంటూ సేవలు చేయడం జరిగిందన్నారు. దీనితో శివసాముల బృందం దాదాపుగా 18వేల రూపాయలను మృతుని కుటుంబానికి బుధవారం అందజేశారు. తమతోపాటు శివమాలవేసే శివస్వామి మృతిచెందడం బాధాకరమన్నారు.

సూర్య
www.suryaa.com



# విలువలతో కూడిన విద్య విద్యార్థులకు అవసరం




విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్‌:** నేటితరం విద్యార్థులకు భారతీయ సంస్కృతీ, సాంప్రదాయ విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని, కేంద్రీయ విద్యాలయంలో చదువుకునేందుకు సీటు వచ్చిందంటే వారి పిల్లలు అదృష్టవంతులనీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన నిధులు కూడా అందిస్తుందని లోక్‌సభ డిప్యూటి ఫ్లోర్ లీడర్, నంద్యాల జిల్లా ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం డోన్ పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ నందు నూతన కేంద్రీయ విద్యాలయ తరగతులను ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్ విద్యపట్ల ప్రత్యేక దృష్టి పెట్టి ముందుకు తీసుకెళ్తున్నారనీ, కేంద్ర ప్రభుత్వం ద్వారా విద్యకు అధిక నిధులు రాబట్టేందుకు కృషి చేస్తున్నారన్నారు. తాను పార్లమెంటరీ విద్యా సలహా కమిటీ సభ్యురాలిగా ఉన్నానని, ఈ అవకాశం ఉపయోగించుకొని రాష్ట్రానికి, నంద్యాల జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ద్వారా విద్యకు ఎక్కువ నిధులు రాబట్టేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డోన్ ఆర్‌డిఓ కెపి.నరసింహులు, డోన్ అర్బన్ సిఐ ఇంతియాజ్‌భాషా, అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నివారణకు కృషి చేద్దాం.

### – డోన్ అర్బన్ సిఐ ఇంతియాజ్‌బాషా




**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్‌:** మాదకద్రవ్యాల నివారణకు కృషి చేసి...సురక్షితమైన సమాజాన్ని నిర్మిద్దామని డోన్ అర్బన్ సిఐ ఇంతియాజ్‌భాష అన్నారు. ఈగల్ ఐజిపి ఆకే.రవికృష్ణ(ఐపియస్) ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా ఎస్పి సునీల్‌షెరాన్(ఐపియస్) సూచనలతో బుధవారం పట్టణంలోని వైష్ణవి జూనియర్ కళాశాల నందు డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని అర్బన్ సిఐ ఇంతియాజ్‌భాష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి మత్తు మిమ్మల్ని, మీ జీవితాలను, మీ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుందని, వాటి వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల సమాచారం ఏదైనా ఉన్న ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ క్రైమ్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, సామాజిక మాధ్యమాలలపై స్వీయ నియంత్రణ, అప్రమత్తత కలిగి ఉండడం వలన సైబర్ క్రైమ్ నేరాలను నియంత్రించవచ్చన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరాలని అవగాహన కల్పించారు. అనంతరం సిఐ ఇంతియాజ్‌భాష ఈగల్ సెల్‌కు సంబందించిన పోస్టర్లను కళాశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది, విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం సిబ్బంది ప్రసాద్, మనోహర్, శక్తి టీం లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్‌అండ్‌బి అధికారుల ఆధ్వర్యంలో రోడ్డుకు మరమ్మత్తులు



**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మంత్రాలయం మండల పరిధిలోని పరమాన్‌దొడ్డి, సింగరాజనహళ్ళి గ్రామాల మధ్య ఉన్న రోడ్డు గత కొద్ది రోజులుగా కురిసిన భారీ వర్షానికి కోతకు గురైంది. రోడ్డు కోతకు గురికావడంతో రెండు గ్రామాల మధ్య ప్రయాణానికి ఇబ్బందులకు గురయ్యారు. గ్రామస్థులు, నాయకులు ఈ సమస్యను టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం స్పందించిన ఇంచార్జీ వెంటనే రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని ఆర్‌అండ్‌బి అధికారులకు తెలిపారు. అధికారులు బుధవారం సుమారు టిప్పర్ల ఎర్రగరుసు వేసి మరమ్మత్తులు చేపట్టారు. సమస్యను విన్నవించిన వెంటనే కోతకు గురైన రోడ్డుకు మరమ్మత్తు పనులు చేయించిన టీడీపీ ఇంచార్జ్ రాఘవేంద్రరెడ్డికి రెండు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ బసప్ప, టీడీపీ నాయకులు గంగన్న, నరసింహులు, వీరేష్, నబీసాబ్, వీరన్న, జగన్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నియమాలపై అవగాహన కలిగి ఉండాలి

**జూపాడుబంగ్లా, మేజర్ న్యూస్ :** రోడ్డు నియమాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై మల్లికార్జున విద్యార్థులకు అవగాహన కల్పించా రు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, సురక్షిత రోడ్డు ప్రయాణంపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అలాగే హెల్మెట్, సీటు బెల్ట్ ప్రాధాన్యత వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయు లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## దూదేకుల కార్పోరేషన్ డైరెక్టర్ పదవి ముస్లీంలకు కేటాయించడం తగదు

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** గుంతకల్లు నియోజకవర్గంలో దూదేకుల కార్పోరేషన్ డైరెక్టర్ పదవి ముస్లీంలకు కేటాయించడం సరికాదని దూదేకుల వర్గం అభ్యంతరం తెలుపుతూ బుధవారం గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను కలిసి దూదేకుల కేర్ ఫోర్స్ కోఆర్డినేటర్లు, నాయకులు వినతిపత్రంను అందజేశారు. జూపాడుబంగ్లా మండలం తూడిచెర్ల గ్రామానికి చెందిన డిసిఎఫ్ ఆర్గనైజర్ దూదేకుల అహమ్మద్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూదేకుల కార్పోరేషన్ పదవులను ఇతర వర్గాలకు ఇవ్వడం సరికాదని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని దూదేకుల సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి పదవి ఇవ్వాలని కోరారు. ఇందుకు యాదవ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిప్పగిరి టీడీపీ మండల కన్వీనర్ లాయర్ షేక్షా వలీ, హోళగుంద మండల దూదేకుల సంఘం అధ్యక్షులు, పి.సాయి, పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దూదేకుల సంఘం నాయకులు

## శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడికి సన్మానం



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులుగా నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకొని మేడా మురళీధర్‌ను నంద్యాల నాయి బ్రహ్మణులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీ నాయి బ్రహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, త్యాగరాజు స్వామి దేవస్థానం చైర్మన్ సుబ్బరాయుడు మాట్లాడుతూ మేడా మురళీదర్ శ్రీశైల అభివృద్ధికి తోడ్పడాలని, మంచి పేరు ప్రఖ్యాతలతో నంద్యాలకు పేరు తేవాలని ఆకాంక్షించారు. అలాగే ఈనెల 18న ధన్వంతరి మహర్షి జయంతిని పురస్కరించుకొని త్యాగరాజు స్వామి ఆలయంలో ప్రతి ఏడాది నిర్వహించి నాదస్వరం విధ్వాంసులకు, అత్యత్తుమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, ధన్వాంతరి వైద్యులకు సన్మాన కార్యక్రమం, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సుబ్బరాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రహ్మణ సంఘం ట్రెజరర్ శీనయ్య, వెంకట్, జానకీరాముడు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పించండి

### – జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ




మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడే పై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. బుధవారం నంద్యాల పట్టణం గాంధీనగర్ ఆరోగ్య కేంద్రంలో కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంపై అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ పాల్గొని మాట్లాడారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు, బోధకాలు వంటి వ్యాధులు దోమ కాటు వల్ల వస్తాయని అన్నారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో దోమకాటుకు గురి కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే జ్వరాలపై అవగాహన కల్పిస్తూ దోమల నివారణ గురించి వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి చంద్రశేఖర్, సహాయ అధికారి సత్యనారాయణ, మలేరియా కార్యాలయం సిబ్బంది, జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులు, సూపర్ వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృష్ణదొడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



స్విచ్ ఆన్ చేసి ఎత్తిపోతల పతాకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

**సి.బెళగల్ మెజర్ న్యూస్ :** తుంగభద్ర నది నుండి సాగునీరు అందించేందుకు బుధవారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కృష్ణదొడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ముందుగా మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం తుంగబద్ర నదిలో జలహారతి అనంతరం కృష్ణదొడ్డి ఎత్తిపోతల పథకాన్ని కమిటీ పెద్దలు,నాయ కులతో కలిసి స్విచ్ నొక్కి ప్రారంభించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఎకరాకు సాగునీరు అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా రైతు సంక్షేమం దిశగా నడిపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బొక్కలు దస్తగిరి అన్నారు. అందులో భాగంగా ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి సాగు నీరు అందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ పథకం ద్వారా 4874 ఎకరాలకు ఐదు గ్రామాల పరిధిలో వ్యవసాయానికి సాగునీరు అందిస్తున్నామని ఈ పథకం ద్వారా పంటలు బండి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి. చిన్నతిమ్మప్ప ,టిడిపి మండల కన్వీనర్ చంద్రశేఖర్,అమర్నాథ్ టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బహుజనులు రాజ్యాధికారం సాధించడమే బిఎస్పీ లక్ష్యం

### – బిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మి నారాయణ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న బిఎస్పీ నాయకులు

**మంత్రాలయంరూరల్, మేజర్ న్యూస్ :** బహుజనుల రాజ్యాధికారం సాధించడమే బహుజన సమాజ్‌వాది పార్టీ లక్ష్యమని బిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మి నారాయణ పిలుపునిచ్చారు. మంత్రాలయం మండలం బూదూరు గ్రామంలో ఆయన జిల్లా అధ్యక్షుడు సామేల్‌తో కలిసి బిఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షిరాం వర్ధంతి సభ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గురువారం కర్నూలులో కాన్షిరాం వర్ధంతి సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి బిఎస్పీ రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మన్న, పెద్దరంగయ్య, రవి, ప్రభుతదాసు, ఆనందు, మార్క్, తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ బలోపేతం.. సమాజ సేవలను విస్తరించడం

**– నూతనంగా చైర్మన్, సొసైటీ సభ్యుల ఎన్నిక**



**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఏజీఎం సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని ఇన్‌చార్జి రెడ్‌క్రాస్ చైర్మన్, డీఆర్వో రామునాయక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్‌లో జిల్లా ఏజీఎం సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు రెడ్‌క్రాస్ కార్యకలాపాలను బలోపేతం చేయడం, సమాజ సేవలను విస్తరించడం లక్ష్యంగా నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాత కమిటీలోని కొంతమంది సభ్యులతో పాటు పట్టణంలోని ప్రముఖ వైద్యులను, విద్యాసంస్థల ప్రతినిధులను చేర్చి కొత్త కమిటీని రూపుదిద్దారన్నారు. అలాగే కొంతమంది పట్టణ ప్రముఖులను ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా చేర్చనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో రెండోసారి చైర్మన్‌గా దస్తగిరి ఎన్నిక కాగా, వైస్ చైర్మన్‌గా డాక్టర్ మమతారెడ్డి, కోశాధికారిగా నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన మేనేజ్‌మెంట్ కమిటీలో డాక్టర్ ఆరిఫాబాను, డాక్టర్ నిషితారెడ్డి, డాక్టర్ నెరవాటి అరుణకుమారి, ఉస్మాన్‌బాషా, పేరుసోముల నరసింహమూర్తి, రాధాకృష్ణయ్య, శ్రీశైలం నాగశేషయ్య, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియకు రాష్ట్ర కమిటీ తరపున రాష్ట్ర కోశాధికారి రామచంద్రరాజు అబ్జర్వర్‌గా హాజరయ్యారు. కర్నూలు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ కేజి గోవిందరెడ్డి, రెడ్‌క్రాస్ ప్రస్తుత జిల్లా సెక్రటరీ, కలెక్టరేట్ ఏఓ శుభకర్, జిల్లా కో ఆపరేటివ్ డివిజన్ అధికారి జానకిరాముడు, సబ్ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎన్నికైన చైర్మన్ దస్తగిరి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో నంద్యాల జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తరించే దిశగా కృషి చేస్తామని ప్రతి కళాశాల, పాఠశాలల్లో జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ యూనిట్లను ఏర్పాటు చేసి విపత్కర పరిస్థితుల్లో సహాయక సైన్యంగా తీర్చిదిద్దడమే మా ప్రధాన లక్ష్యం అన్నారు.

# ఓర్వకల్ నుండి హిందూపురం వరకు పారిశ్రామిక కారిడార్

**– ఈనెల 16న కర్నూలుకు మోదీ రాక**

**– 4లక్షలమందితో భారీ బహిరంగ సభ**

**– ఎమ్మెల్యే కె.ఈ శ్యాంబాబు**





**పత్తికొండ, మేజర్‌న్యూస్ :** రాయలసీమ రతనాల సీమ కానుందని కర్నూలులో జరిగే ప్రధాని బహిరంగ సభ, అందుకు వేదిక కానుందని ఎమ్మెల్సి టీడీపీ జోన్ 5 ఇంచార్జీ బీద రవిచంద్రయాదవ్ , ఎమ్మెల్యే కె.ఈ శ్యాంబాబు, జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, ఎంపి నాగరాజులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పత్తికొండ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కె.ఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రదాని ఐదోసారి పర్యటన కర్నూలు వస్తున్నారని, రాష్ట్రానికి ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైలం దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్రప్రభుత్వంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం మెగా ప్రాజెక్టు చేపట్టనుందన్నారు. 16న జరిగే బహిరంగ సభలో దేశంలోనే మొదటిసారిగా డ్రోన్ సిటిని ప్రధాని శంకుస్థాపన చేస్తున్నారని, ఓర్వకల్లు నుంచి హిందూపురం మధ్య ప్రాంతాన్ని పారిశ్రామిక కారిడార్‌గా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయనుందన్నారు. పరిశ్రమలలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు అందుతాయన్నారు. రాష్ట్రాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు సీఎం నారాచంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అలుపెరుగని కృషి చేస్తున్నారన్నారు. ఐదేళ్ల పాలనలో భూదందాలు, ఇసుక దందాలతో కాలం వెల్లదీసిందని మాజీ ఎమ్మెల్యే ఇప్పుడు అభివృద్ధి గురించి ఆసత్య ఆరోపణలు చేయడం హస్యాస్పందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, బత్తిన వెంకట్రాముడు, రామానాయుడు, హోటల్ శ్రీనివాసులు, వెంకటపతి, మనోహర్ చౌదరి, కడవల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్టి 2.0 పై అవగాహన

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో జిఎస్టి 2.0 పై అవగాహనను ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని ప్యాపిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో జిఎస్టి 2.0పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ జిఎస్టి2.0 సంస్కరణల వల్ల మన దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతందని, ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. ఇంతకుముందు ఉన్న నాలుగు రకాల పన్నుల శ్లాబులకు బదులుగా ప్రస్తుతం రెండు శ్లాబులు(5శాతం మరియు 18శాతం) మాత్రమే ఉంటాయన్నారు. దీనివల్ల పన్నుల విధానం మరింత సులభతరంగా, పారదర్శకంగా మారుతుందన్నారు. ఇది దేశ ప్రజలకు ఎంతో ఊరటనిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నవీన్‌పాల్, అధ్యక్షులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

## వినూత్న బోధనా పద్ధతుల్లో నాణ్యమైన విద్యనందించాలి

**– ఎంపీ బైరెడ్డి శబరి**



**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** వినూత్న బోధనా పద్ధతుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడం ఎంతో అవసరమని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వడం మంచి పరిణామం అని నంద్యాల ఎంపీ, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నంద్యాల ఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు మాత్రమే ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను ప్రధానం చేస్తుందని వాటి ఆధారంగా తీసుకుని ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల్లో మంచి బోధన చేసే వారిని కూడా ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించాలని ఉద్దేశంతో ఈ అవార్డులు అందించడం శుభ పరిణామం అన్నారు.

# ఆగిన అద్దె బస్సులు.. ఇబ్బందులు పడ్డ ప్రయాణీకులు



ఆగిన అద్దె బస్సులు

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** కోవెలకుంట్ల నుంచి వివిధ ప్రాంతాలకు వందలాది మంది ప్రయాణీకులు ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. అయితే బుధవారం అద్దె బస్సులకు సంబంధించిన డ్రైవర్‌పై దాడి జరిగిందని అద్దె బస్సుల యజమానులు, డ్రైవర్లు బస్సులను ఆపి వేయడంతో బుధవారం ఉదయం నుంచి బస్సులు నిలిచిపోవడంతో ఒక రూట్‌కు ఒక్కటే బస్సు తిరగడం వల్ల ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోవెలకుంట్ల డిపో నుంచి 17 అద్దె బస్సులు నిలిచిపోవడంతో పలు ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణీకులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పనుల మీద ఇతర ప్రాంతాలకు వెళ్ళాల్సిన ప్రయాణీకులు అనుకోకుండా జరిగిన సంఘటనతో ఇబ్బందులు పడ్డారు. అద్దె బస్సుకు సంబంధించిన డ్రైవర్‌పై దాడి జరగడంతో ప్రైవేటు అద్దె బస్సుల యజమానులు, డ్రైవర్లు తమ బస్సులను పూర్తిగా నిలిపి వేశారు.

## సూపర్ జిఎస్‌టితో ప్రజలకు లబ్ధి



మాట్లాడుతున్న బన్నూరు రామలింగా రెడ్డి

**మహానంది, మేజర్‌న్యూస్ :** సూపర్ సిక్స్ పథకాల మాదిరిగానే సూపర్ జిఎస్‌టి ప్రజలకు లబ్ధి చేకూరుస్తుందని కెసి కెనాల్ ప్రాజెక్ట్ చైర్మెన్ బన్నూరు రామలింగా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలంలోని ఆర్ఎస్ గాజులపల్లె గ్రామంలో సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమంను సర్పంచు అస్లాం బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామలింగా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తగ్గించిన సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. నిత్యావసర సరుకులపై కూటమి ప్రభుత్వం జిఎస్‌టిని తగ్గించి ఆర్థిక భారాన్ని తగ్గించిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశశ్విని, టీడీపీ మండల కన్వీనర్ కంచర్ల శివయ్య, జనసేన మండల అధ్యక్షులు మారెడ్డి రామయ్య, జనసేన పార్టీ నాయకులు నల్లబోతుల మల్లికార్జున, టీడీపీ నాయకులు పాశం శ్రీనివాసులు, పాశం రమణ, ఆత్మకూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ లాలమ్మ, జనసేన నాయకులు బోనాసి ప్రసాద్, చిన్న కుళాయి, రాజశేఖర్ నాయక్, పొదుపు మహిళలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి 4 తులాల బంగారు గొలుసు విరాళం



బంగారు గొలుసు అందజేస్తున్న భక్తులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** లక్షలాది మంది భక్తుల ఆరాధ్య దైవం, ప్రముఖ శైవ క్షేత్రం పాణ్యం మండలం ఎస్ కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి 42 గ్రాముల (4 తులాల 200మిల్లీగ్రాములు) బంగారు తాళి బొట్టు గొలుసును బుధవారం విరాళంగా భక్తులు వితరణ చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం రామకృష్ణ తెలిపారు. తిరుపతి పట్టణానికి చెందిన కర్నాటి సుబ్బ ప్రశాంత్, భార్య కర్నాటి స్వాతిలు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి ముక్కుబడిగా బంగారు గొలుసు అందజేసినట్లు ఈవో తెలిపారు. వీటి విలువ సుమారు రూ.4.50 లక్షలు ఉంటుందని అన్నారు. దాతలు మాట్లాడుతూ స్వామివారు తమ ఇంటి ఇలవేల్పు కావడంతో బంగారు గొలుసు భక్తితో సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ మర్యాదలతో అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వాద మంటపం నందు పూలమాలలు, స్వామివారి శేష వస్త్రాలతో ఘనంగా సత్కరించి లడ్డూ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సురేష్‌శర్మ, సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## 20వ వార్డులో కంప చెట్లు తొలగింపు



కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** పట్టణ సమీపంలోని 20వ వార్డులో మురికి కాలువను, కంప చెట్లను బుధవారం గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. సిపిఐ ఆద్వర్యంలో ఎంపిడిఓ రాముడు, సర్పంచ్ భాగ్య రత్నమ్మ, శానిటేజర్ వెంకటేశ్వర్లు, 20వ వార్డు మెంబర్ రాజేశ్వరిలకు తెలియజేయగా వెంటనే స్పందించారు. అధికారులు మురికి కాలువను, కంప చెట్లను తొలగించి క్లీన్‌చేశారు. అలాగే సిసిరోడ్లు, మురికి కాలువల నిర్మాణం చేపట్టి ప్రజలు అనారోగ్యాలకు గురి కాకుండా చూడాలని సర్పంచ్ భాగ్యరత్నమ్మకి కాలనీవాసులు తెలియజేశారు. సిపిఐ మండల కార్యదర్శి రాజు, పట్టణ కార్యదర్శి శేష యాదవ్, ఏఐటియుసి నాయకులు మద్దూరు రాముడు, సులోచన, సువర్ణ, మహిళలు, కాలనీవాసులు, పాల్గొన్నారు.

సూర్య

గురువారం | 09 అక్టోబరు 2025

# ఇంటింటికి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రియ ఆదేశాల మేరకు టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్‌భాష ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా చాగలమర్రి పట్టణంలోని 3,4 వార్డులో,మల్లెం వీధిలో పట్టణ టిడిపి కోశాధికారి మల్లెం మురళి, చాగలమ్మ చెంచు కాలనీలో 4వ ఎపీటీసీ ఇన్‌చార్జ్,టిడిపి నాయకులు జెట్టి నాగరాజులు ఇంటింటికి వెళ్ళి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పట్టణ ఉపాధ్యక్షుడు కామిశెట్టి రమేష్ , మల్లెం శ్రీహరి ,మల్లెం దయానంద రమేష్ , అలాంస గారి హనీఫ్ , పీరమ్మ గారి గౌస్ మొహిద్దిన్ ,బారిక్ చామల్ హుసేన్‌సా, పార్టీ అభిమానులు ,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# సత్తా చాటిన సీమ కుర్రాడు



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గం. పరిధిలోని పెద్దకడబూరు గ్రామానికిచెందిన ఎ.వెంకటరెడ్డి,పద్మజ దంపతుల కు జన్మించిన వంశీకృష్ణారెడ్డి తెలంగాణలో విడుదలైన గ్రూప్ -1ఫలితాల్లో రాష్ట్ర 3వర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్ గా ఎంపికయ్యారు. అయితే వంశీ కృష్ణ రెడ్డి ప్రస్థుతం ఎస్.ఎస్.సి ఇన్ కమ్ టాక్స్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే వీరి తండ్రి రైతు.. ఆరుగాలం శ్రమించి వ్యవసాయం చేస్తూ పంటలు ఉండిస్తూఉండే వారు తాను కూడా ప్రజాసేవలో తరలించాలని సంకల్పంచారు. ప్రభుత్వ కొలువు తో అది సాధ్యంఅని బావించాడు.వీరితాతఎ.వెంకట రెడ్డి.భారత దేశ స్వాతంత్ర్య సమరయోధుడు..

## అహోబిలంలో కొత్త కేశఖండనశాలను ప్రారంభించిన పీఠాధిపతి



**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన దిగువ అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొత్త కేశఖండనశాలను అహోబిలం మఠం 46వ పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి బుధవారం ప్రారంభించారు. పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేసారి వందమంది కేశఖండన చేయించుకునే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్త్రీలకు, పురుషులకు వేరువేరుగా స్నానపు గదులను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దేవస్థానం అభివృద్ధికి భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. రానున్న కాలంలో అహోబిల క్షేత్రం ఇంకా అభివృద్ధి చెందాలన్నదే తమ ఆకాంక్ష అని పేర్కొన్నారు.

## పెళ్లికెందుకు తొందర.. బాలికను చదివించు ముందర

**-బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహణ -బాల్య వివాహాలు వద్దు..బాలికలను చదివిద్దాం..**



**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెలగల్ మండలంలోఐసిడిఎస్‌సూపర్వైజర్‌జరీనా భాను ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కస్తూర్బా గాంధీ పాఠశాలలో భేటీ బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించి బాలికలు కౌమార దశలో తీసుకోవలసిన జాగ్రత్తలు, బాలవివాహాలు,ఫోక్సు చట్టం, పోషక పదార్థాలు గల ఆహార, పండ్లు కూర గాయలు తీసుకోవాలని వివరించారు, అనంతరం బాలికలకు ప్రత్యేక గేమ్ ఆడించు బహు మతులు అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉన్నతపరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు నాగలక్ష్మి,కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి మరియు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి బీసీ



**బనగానపల్లె,మేజర్ న్యూస్ :** కోనసీమ జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాద ఘటనపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనలో పలువు రు మృతి చెందడంపై తీవ్ర ఆవేదన చెందానని తెలిపారు.ప్రమాదంలో గాయపడ్డ బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులకు ఆదేశం జారీ చేశారు. ప్రమాదంలో మృతి చెంది నకుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న మంత్రి అన్నారు.

## మహిళలకు, విద్యార్థినీలకు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం



**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః** కొలిమిగుండ్ల గ్రామంలోని సాయిబాబా దేవాలయంలో బుధవారంనాడు నంద్యాల దిశ పోలీసు స్టేషన్ సి.ఐ గౌతమి రెడ్డి మహిళలు, విద్యార్థినీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శక్తి యాప్ గురించి ఫోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాల్య వివాహాల వలన కలిగే నష్టాల గురించి, ఫేస్‌బుక్‌లో ఫోటోలు పంపడం, వీడియో కాల్స్ చేయడం , కొత్త లింకులు వస్తే వాటిని ఓపెన్ చేయడం వలన కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు.

# వన్య ప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న అధికారులు

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనివన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రుద్రవరం రేంజ్‌ఫారెస్టు ముర్తుజావలి పేర్కొన్నారు. బుధవారంరేంజ్ ఆఫీసర్, రుద్రవరం వారి ఆధ్వర్యంలో డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్ అనురాగ్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు వన్య ప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా చాగలమర్రి గ్రామం బాలికల ఉన్నత పాఠశాలలోవిద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడిన వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారము కఠినమైన శిక్ష విధించబడు ఉందన్నారు. వన్య ప్రాణుల నివాసాలను సంరక్షించి జీవవైవిధ్యమును పరిరక్షించాలని, వన్యప్రాణులు గ్రామాలలోనికి వస్తే వాటికి హాని చేయవద్దని వెంటనే ఈ విషయమును అటవీ అధికారులకు తెలియజేయాలనికోరారు పంట పొలాల చుట్టూ కరెంటు తీగలుగాని,ఉచ్చులు గాని పెట్టవద్దని, వాటికి ఆవాసాలైన టువంటి అడవులను నరకవద్దని, గ్రామానికి సమీపంలో ఉన్న చెట్లను నరకవద్దని , అడివిలో ఎక్కడైనా మంటలు మండితే వాటిని ఆర్పి వేయడానికి అటవీ అధికారులకు సహకరించాలన్నారు, అడవిలోనికి ఎవరు కూడా ప్లాస్టిక్ ను తీసుకొని వెళ్లరాదని తెలియజేయజేశారు. అనంతరం పెద్ద మకాణంసర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించి. పిల్లలకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి జూనియర్స్ మరియు సీనియర్లకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ .మక్తర్ భాష, ఫారెస్ట్ సెక్షన్ అధికారి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అహోబిలం సెక్షన్ శ్రీనివాసులు రెడ్డి,ఎఫ్ ఎస్ ఓలు రాణమ్మ ఖాన్,శ రామకృష్ణ, నాగ ఉసేనయ్య,మదన్ గోపాల్ ,సురేంద్ర గౌడ్ జే. సుభాష్,జేమ్స్ పాల్, ప్రొటెక్షన్ వాచర్సు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివలక్ష్మి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయునులు, విద్యార్థినీలు,గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

# బనగానపల్లెలో బీజేపీ నాయకుల సమావేశం



బిజెపి నాయకుల సమావేశ దృశ్యం

**బనగానపల్లె,మేజర్ న్యూస్ :** బిజెపి రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు బిజెపి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు సూచన మేరకు బిజెపి నియోజకవర్గ కార్యాలయం నందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి లిలిఒంటెద్దు బండి కిరణ్‌లిలి గారు పాల్గొని ఈ నెల 16 న ప్రధానమంత్రి మోడీ పర్యటన పై వివరాలు సేకరించి అసెంబ్లీ స్థాయిలో పెద్ద సంఖ్యలో బిజెపి శ్రేణులు తరలి వెళ్లాలని అందుకు సంబంధించి కార్యాచరణ రూపొందించుకోవాలని అలాగే కూటమిలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో కార్యకర్తలతో సమన్వయం చేస్తూ ముందుకు వెళ్లాలని వారు అన్నారు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ యాదవ్ మాట్లాడుతూ కార్యకర్తలు గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసి కేంద్ర ప్రభుత్వ పథకాలు అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని నరేంద్ర మోడీ గారు వస్తున్న శుభ సందర్భంగా వారి రాక ను ప్రజలు స్వాగతించే విధంగా ప్రచారం చేయాలని గ్రామాలలో రైతులు కార్మికులు కర్షకులను నరేంద్ర మోడీ గారిని చూసే అవకాశం కల్పించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని వారు అన్నారు బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు చాందినీ గారు మాట్లాడుతూ మోడీ గారి పర్యటన లో బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున ప్రచారం కోసం గ్రామ గ్రామాన బిజెపి నాయకులు కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం మహిళల కు అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలు తెలియజెప్పాలని కోరారు.

# ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రి బిసి సమీక్ష

**బనగానపల్లె,మేజర్ న్యూస్ :** ప్రధాని పర్యటన ఏర్పాట్లపై కర్నూలు జిల్లా కలెక్టర్ తో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా కలెక్టర్ ఏ. సిరి, జిల్లా ఆర్ అండ్‌బీ శాఖ ఎస్ ఈ, ఈఈలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బిసి మాట్లాడుతూ ప్రధాని పర్యటన వేళ జిల్లా వ్యాప్తంగా ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని ఆర్ అండ్‌బీ అధికారులకు మంత్రి బిసి ఆదేశించారు. ఎక్కువగా ట్రాఫిక్ ఉండే ప్రాంతాలను ముందస్తుగానే గుర్తించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో.. ఆర్ అండ్‌బీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తజాతీయ రహదారుల్లో అకస్మాత్తుగా ట్రాఫిక్ స్థంభించిపోయే సమస్యలను అధిగమించేందుకు.. ప్రత్యామ్నాయంగా ఎస్కేప్ రోడ్డు మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని,శ్రీశైలంలో ప్రధాని పర్యటన నేపథ్యంలో, స్థానికంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. శ్రీశైలంలో స్థానికంగా రహదారుల మరమ్మతుల పనులను వేగవంతంగా పూర్తి చేయాలి అవసరమైతే, ఇతర జిల్లాల ఆర్ అండ్‌బీ శాఖ అధికారులను ఉపయోగించుకుని, సమర్థవంతంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## ఈ నెల 10న కొలిమిగుండ్లలో మండలస్థాయి స్కూల్ గేమ్స్ పోటీసులు

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః** కొలిమిగుండ్ల మండలంలో ఎస్.జి.ఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడా ఎంపిక పోటీలు అక్టోబర్ 10న నిర్వహిస్తున్నారు. ఈ పోటీలు కొలిమిగుండ్ల పట్టణంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తారని కొలిమిగుండ్ల మండల విద్యాశాఖ అధికారులు ఆర్. అబ్దుల్ కలాం, బి. రామకృష్ణయ్య తెలియజేశారు. ఈ పోటీలలో కబడ్డీ, కోకో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ వంటి క్రీడలు నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాధికారి ఆర్. అబ్దుల్ కలాం తెలిపారు. అండర్ - 14,17 విభాగంలో బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తున్నామని ఈ పోటీలలో ప్రభుత్వ ప్రవేటు పాఠశాలలు పాల్గొనవలసినదిగా కోరుతున్నాము.

# ఆరు నెలలలోపు పిల్లలకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి

**వెల్దుర్తి ఐసిడిఎస్ సిడిపిఓ లుక్**



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సిడిపిఓ లుక్

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ః** ఆరు నెలలలోపు పిల్లలకు ఆరు నెలలపాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని వెల్దుర్తి ఐసిడిఎస్ సిడిపిఓ లుక్ అన్నారు. వెల్దుర్తి ప్రాజెక్ట్ రామళ్ళకోట సెక్టార్‌లోని కలుగొట్ల గ్రామ పంచాయితీ అంగన్‌వాడి-3 కేంద్రాలకు సంబందించి ఎస్సి కాలనీలోని అంగన్‌వాడి కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణమాసం కార్యక్రమాన్ని బుధవారం వెల్దుర్తి ఐసిడిఎస్ సిడిపిఓ లుక్, సూపర్‌వైజర్ శ్రీదేవిల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు ప్రతిరోజు భోజనంలో తినాలన్నారు. ఆరు నెలల తరువాత అంగన్‌వాడి కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించి, 7వ నెల నుండి బిడ్డలకు ఇవ్వవలసినటువంటి అదనపు ఆహారం బాలామృతం ఏవిధంగా పెట్టాలనే విషయంపై గర్భవతులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం మెర్సీ, జయశ్రీ, హారిక, శ్వేత మధులు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు కామేశ్వరి, శాంత, లక్ష్మిదేవి, హెల్పర్లు నాగేంద్రమ్మ, రాధిక, మహేశ్వరి, గర్భవతులు, బాలింతలు, ప్రీ స్కూల్ పిల్లల తల్లులు పాల్గొన్నారు.

# శిథిలావస్థకు చేరిన మట్టి మిద్దెలను గుర్తించండి

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** మండలంలో చిదులావస్థకు చేరిన మట్టి గుర్తించి ప్రమాదాలు జరగకుండా నివారించాలని ఎంపీడీవో తాహర్ ఉషేన్ కోరారు బుధవారం హౌసింగ్ డిఈ విజయ్ బాబు ఆదేశాల మేరకు చాగలమరి మండలం ఎంపీడీవో కార్యాలయంలోఎంపీడీవో తాహెర్ హుస్సేన్అధ్యక్షతన ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ మరియు మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది హౌసింగ్ కి సంబంధించిన గృహ నిర్మాణాల పరిధిరి బేస్ మట్టం వదులుకొని పూర్తి దశకు వచ్చిన వాటి వివరాలను సేకరించాలన్నారు. వర్షాలు అధికంగా కురుస్తుండడంతో



గ్రామాల్లో ఉన్న మట్టిమిద్దెల్లో నివాసం ఉన్న వారిని అప్రమత్తపరిచి మట్టిమిద్దెలు శిధిలావస్థకు చేరి ఉంటేనివాసం ఉన్న వారిని కాళీ చేయించి పునరావసం కల్పించాలని కోరారు. లబ్ధిదారులు గృహ నిర్మాణాలపై అలసత్వం చూపకుండా నిర్మాణ పనులను వేగవంతం చేసి ఎటువంటి నిర్లక్ష్యం చేయరాదన్నారు. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు పెండింగ్ లేకుండా చేయాలని ఎంపీడీవో ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆదేశించడం జరిగింది 90 రోజు పని దినాలకు సంబంధించి హౌసింగ్ లబ్ధిదారులకు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించడం జరిగింది. జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవోఅన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ఏఈ నవీన్ ఏపీవో, ఉమామహేశ్వర్ మండల వర్క్ ఇన్స్పెక్టర్ల ఓబులేసు, సుబ్బరాయుడు ఇంజనీ రింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# బనగానపల్లె డిగ్రీ కళాశాలలో జీఎస్టీ 2.0 వారోత్సవాలు

**బనగానపల్లె,మేజర్ న్యూస్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం మరియు కళాశాల విద్యా డైరక్టర్ వారి ఆదేశాల ప్రకారం జీఎస్టి 2.0 సూపర్ జీఎస్టి సూపర్ సేవింగ్స్ అనే అంశంపై కళాశాల లోని వాణిజ్య విభాగ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.లలితాఅధ్యక్షత వహించడం జరిగినది ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టి 2.0 రూపంలో సరళతరం చేసిన పన్నుల విధానంతో పేద మధ్య తరగతి వర్గం వారికి అనేక లాభాలు ఉన్నాయంటూ ప్రస్తుత్తం తగ్గిన పన్ను విధానం ద్వారా ప్రజలు తమ ఆదాయాన్ని పొదుపు చేసుకోవడమే కాకుండా ఆ పోదుపును ఇతర మార్గాలద్వారా అభివృద్ధికై వినియో గించుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కామర్స్ ఇన్చార్జి డా. కె. రామక్రిష్ణ విధ్యార్థులకు ఈ జీఎస్టి ను సులభతర పద్ధతి ద్వారా అవగా హనను కల్పించడం జరిగింది. తదుపరి విద్యార్థులకు జీఎస్టీ, సేవింగ్స్పై




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ర్యాలీ కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. లలితా ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా కామర్స్ విభాగాధిపతి డా. కె. రామకృష్ణ, అధ్యాపకులు డా. కె. నాగతిమ్మయ్య, శ్రీమతి సి. వరలక్ష్మి, శ్రీమతి సి. మాధవి విద్యార్థులకు జీఎస్టీ విధానం, పొదుపు ప్రాధాన్యం గురించి వివరించారు.విద్యార్థులు జీఎస్టీపై నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు.

# రాష్ట్ర స్థాయితైక్వాండో పోటీలకు విద్యార్థినీ,విద్యార్థులు ఎంపిక



రాష్ట్ర స్థాయి క్రీడాపోటిలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

**దొర్నిపాడు, మేజర్ న్యూస్ :** ఈనెల 4వ తేదీన కర్నూలు జిల్లా లో అవుట్ డోర్ స్టేడియం (డి ఎస్ ఏ )లో జరిగిన జిల్లా స్థాయి జి ఎస్ ఎఫ్ (త్రైక్వాండో )పోటీలలో అండర్ 14మరియు అండర్ 17విభాగంలో మండలకేంద్రమైన దొర్నిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి క్రీడాపోటిలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి చెన్నకేశ్వరి తెలిపారు ఈ సందర్భంగా హెచ్ ఎం చెన్నకేశ్వరి మాట్లాడుతూ అండర్- 14,విభాగంలో వంశీ, శివగౌతమ్, హన్సిక, శివపావని, అండర్- 17విభాగంలో, అఖిల్ ప్రకాష్, మహమ్మద్ అఫ్రిది, వెంకటదివ్య లు ఎంపికైనట్లు ఆమెతెలిపారు విద్యార్థిని విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడాపోటిలకుఎంపికయ్యేటట్లు కృషి చేసిన వ్యాయామ ఊపాధ్యాయుడు దేవేంద్రను ఆమె అభినందించారు ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి చెన్నకేశ్వరి వ్యాయామ ఉపాధ్యాయుడు దేవేంద్ర, ఉపాధ్యాయులు రమణయ్య, కవిత, రవిప్రకాష్, చెన్నయ్య, నరసింహ, పుల్లయ్య, విశ్వనాధ రెడ్డి, చంద్రశేఖరయ్య సరస్వతి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు .

# లక్ష్మాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించిన ఎంపీ బైరెడ్డి శబరి

**- ఎస్ఎస్ ట్యాంక్ కాంట్రాక్టర్ పై ఎంపీ ఆగ్రహం**

**పగిడ్యాల మేజర్ న్యూస్ :** కలుషిత నీరు తాగి రోగాల భారినపడితే ఎవరు బాధ్యులని సమ్మర్ స్టోరేజ్‌ను శుభ్రం కూడా చేయలేరా, చేత గాకపోతే తప్పుకోండి, పనిచేసే వారు వస్తారు అంటూ సంబంధిత కాంట్రాక్టరుపై నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నంద్యాల జిల్లా పగిడ్యాల మండల పరిధిలోని లక్ష్మాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్



బైరెడ్డిశబరి మాట్లాడుతూఈ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పగిడ్యాల మండలంతో పాటు, జూపాడుబంగ్లా మండల పరిధిలోని గ్రామాలకు, వేసవిలో దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం నిధులు ఖర్చుపెట్టి ఈ రెండు మండలాల ప్రజలకు అంకితం చేస్తే ప్రజలకు మంచినీళ్లు సదుపాయం కల్పించకుండా నిధులు దుర్వినియోగం చేస్తూ స్టోరేజ్ ట్యాంక్ శుభ్రంగా లేకుండా వాటర్ సరిగా ఫిల్టర్ చేయకుండా పంపిణీ చేస్తే ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హెచ్చరించారు. కాంట్రాక్టర్ తో చర్చించి నీటిని సరిగ్గా శుద్ధి చేసి ప్రజలకు దాహార్తిని తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్ డబ్ల్యూ ఎస్ డి ఈ నీ ఆదేశించారు. గ్రామ సర్పంచ్ బుడగ జంగం సిరిగిరి సుజాత, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సూర్య కథనానికి స్పందన

**ః- అమ్మాయిని తిరుపతి హాస్టల్‌కు పంపేందుకు అధికారులు ఆదేశాలు**

**కర్నూలు, మేజర్‌న్యూస్ ః** నేటి దినపత్రిక సూర్యలో బుధవారం ప్రచురితమైన కాలేజీ నుండి కాపురానికి మైనర్ బాలిక అనేక కథనానికి (ఐసిడిఎస్) మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు స్పందించి ప్రత్యేక టీంను పంపించి అమ్మాయిని తల్లిదండ్రుల నుండి తీసుకొచ్చి సిడబ్ల్యూసి బాల సంక్షేమ కమిటీ సభ్యుల ముందు హాజరు పరిచి విషయాలను విచారించి బాలిక సంక్షేమం కొరకు ఉన్నత చదువుల కోసం తిరుపతి హాస్టల్‌కు పంపించేందుకు ఆదేశాలు జారీ చేశారు. తల్లిదండ్రుల అత్యుత్సాహం వలన 18ఏళ్లలోపు బాల బాలికలకు వివాహాలు జరిపించడంతో శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, భవిష్యత్తులో అనేక సమస్యలు ఏర్పడతాయని వీటిని సంరక్షించడానికి బాలికల సంక్షేమం కొరకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని వాటిని ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి మహిళా శిశు సంక్షేమ శాఖ వెనుకాడదని బాలిక విషయంలో ఇలాంటి పొరపాట్లకు మళ్లీ తావివ్వకుండా చూసుకుంటామని ఐసిడిఎస్ పిడి విజయ తెలియజేశారు.

## గ్రామ పంచాయతీల ద్వారా సొంతఆదాయ వనరులు సమకూర్చుకోవాలి



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** గ్రామ పంచాయతీల ద్వారా సొంతఆదాయ వనరులు సమకూర్చుకొని గ్రామాభివృద్ధికికృషి చేయాలని డిప్యూటీ ఎంపీడీవోమేకల జయ రాముడు అయా గ్రామాల సర్పంచులకు పంచాయతీ కార్యదర్శిలకు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు సూచించారు.బుధువారం పెద్దకడుబూరులో స్థానిక ఎంపిడిఓ కార్యా లయంలో రెండు రోజుల పాటు సర్పంచ్ లు. పంచాయతీ కార్యదర్శిలు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లుకు రెండురోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో జయరాముడు మాట్లాడుతూ మీ యొక్క గ్రామ పంచాయతీలలో ఉన్న వనరులు ద్వారా ఆదాయం పెంపొందించేకోనెందు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఇంటి పన్ను. నీటిపన్ను. పంచాయతీ స్థలాల్లో ఎవరైనా కిరాణాదుకాణం. భీడిబంకులు.మటన్‌షాప్. కూరగాయల. టీబంకులు హొటళు ఏర్పాటు చేసుకుని ఉన్న వ్యక్తులు వద్ద నుంచి పన్నుల రూపంలో వసూళ్లు చేసిన ఆదాయంతో గ్రామాభివృద్ధికికృషి చేయాలని పలువురు సర్పంచ్. పంచాయతీ కార్యదర్శి లు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లును కోరారు.

## స్మశాన వాటికను కబ్జా నుండి కాపాడండి సారూ..

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్ః** మండల పరిధిలోని మదార్‌పురం గ్రామానికి చెందిన స్మశాన వాటిక కబ్జాకు గురికాకుండా కాపాడాలని మదార్‌పురం గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ మదార్‌పురం గ్రామంలో ఉంటే హిందూ స్మశాన వాటిక స్థలాన్ని వెల్దుర్తికి చెందిన మాజీ ఆర్మీ మాల ఆంజనేయులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడని, కావున అతని నుండి మరెవ్వరు మా గ్రామానికి చెందిన స్మశాన వాటిక స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా తహశిల్దార్ కార్యాల యంలో అడంగల్, ఆర్ఓఆర్‌లో ఈ స్థలం స్మశాన వాటిక స్థలం అని అడంగల్, ఆర్ఓ ఆర్‌లో నమోదు చేయాలని కోరారు. అందులో భాగంగా బుధవారం పత్తికొండ నియోజకవర్గం ఎమ్మె ల్యే కేఈ.శ్యాంకుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. బంట్రోతు మల్లికార్జున, గ్రామ మాజీ సర్పంచ్ రామచంద్రరావు, మదార్‌పురం గ్రామస్తులు బోయ రమేష్, యోగి వెంకటరా ముడు, గొల్ల జగదీష్, రామచంద్రుడు, బెల్లం దినేష్‌కుమార్‌యాదవ్, బి.సాయి, బి.మాదవ్‌లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కేఈ.శ్యాంకుమార్‌ను కలిసిన మదార్‌పురం గ్రామస్తులు

## మల్లెల రాజశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బెస్త మల్లికార్జున



**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ః**

ఆంధ్రప్రదేశ్ బెస్త సంక్షేమం, అభివృద్ధి కార్పోరేషన్ డైరెక్టర్‌గా ప్రజావైద్యశాల బెస్త మల్లికార్జున నియమితులైన సందర్భంగా నంద్యాల జిల్లా టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు, టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్‌ను బుధవారం ఆయన స్వగృహం నందు మర్యాదపూర్వకంగా కలిసి, పూలమాల, శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు.

## సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఎక్కడ?

**సి.బెలగల్,మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలంలో బుధవారం ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి సభ్యులు గైహజరయ్యారు.సభ్యులు లేకుండానే చర్చలు లేకుండానే అధికారులతో సమావేశాన్ని ప్రారంభించారు. మండల అభివృద్ధికి గ్రామాల అభివృద్ధికి సర్వసభ్య సమావేశం ఒక చక్కని వేదిక ఇందులో నిధులు నియామకా లు సమస్యలు అభివృద్ధి పై సుదీర్ఘంగా చర్చల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదించుకునే అవకాశం సర్వసభ్య సమావేశం కల్పిస్తుంది. సమావేశంలో వాడు మెంబర్ నుంచి సర్పంచ్ దాకా ఎంపిటిసి నుండి జడ్పిటిసి వరకు సమావేశంలో పాల్గొని చర్చించుకునే చక్కని వేదికకు సభ్యులు రాకపోవడం చాలా విడురం. ఇదె మండలంలో జరిగింది. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తప్ప సభ్యులు లేకపోవడం చర్చలకు తావు లేకుండానే సర్వసభ్య సమావేశం ముగిసింది.




## సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలి

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పెద్దకడుబూరు గ్రామంలో స్థానిక రామలింగేశ్వర స్వామి ముఖద్వారం నుండి రామ లింగేశ్వర దేవాలయం వరకు సిమెంట్ రోడ్డు పనులను చేపట్టాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఈడిగ తిక్కన్న. రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్లపరమేశ్ లు పేర్కొన్నారు. అలాగే ఈ రోడ్డు ప్రక్కన సరియైన సిమెంట్ రోడ్ల డ్రైనేజీలు లేకపోవడంతో మురుగు నీరంత రహదారుల పైకి చేరి రోడ్డంత బురద మయంగా తయారైందని అంతేకాకుండా ఈరోడ్డుపైకి జనం రావలన్న అనేక ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి నెలకొందని వారు తెలిపారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డు పై పడిన గుంతల్లో మట్టి వేసి సిమెంటు రోడ్డు వంటి పనులు చేపట్టాలని లేని పక్షంలో స్థానికకాలిని వాసులుతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు..



# రస్తాలేదు... పత్తి ఇంటికి రాదు...

- భారీ వర్షాలతో కోతకు గురైన పొలాల దారి
- దారి పొడవున ముళ్లకంపలు.. రైతుకు తిప్పని తిప్పలు
- వంక దాటాలంటే నానా అవస్థలు పడాల్సిందే...





వంకలో నుంచి పత్తి మూటను మోసుకొస్తున్న రైతు

**మంత్రాలయం రూరల్, మేజర్‌న్యూస్ :** మంత్రాలయం మండల పరిధిలోని బూదూరు గ్రామంలో రైతులు ఇక్కట్లు విపరీత స్థాయికి చేరింది. గత నెలలో కురిసిన అకాల వర్షాల కారణంగా గ్రామానికి పడమటి వైపు ఉన్న పొలాలకు వెళ్లే బెళగల్ దారి వాగు ఉధృతంగా ప్రవహించడంతో రస్తా మొత్తం కోతకు గురైంది. కొన్నిచోట్ల వాగు ఉధృతికి భారీ గుంతలు పడ్డాయి. దీంతో ఎడ్లబండ్లే కాదు ట్రాక్టర్లు కూడ అవతలికి వెళ్లడం లేదు. గ్రామ రైతులు వాగుదాటి వెళ్లలేక, పొలాల్లో ఉన్న పత్తి ధాన్యం ఇంటికి తీసుకురాలేని పరిస్థితి ఏర్పడింది. దారి పొడవునా ముళ్లకంపలే ఉన్నాయి. బూదూరు గ్రామానికి చెందిన వ్యవసాయ భూమి సుమారుగా 800 ఎకరాలు భూమి ఉంది. వందలాదిమంది రైతులు ఈబెళగల్ దారి సుంకేశ్వరి, తిమ్మాపురం పొలాలవైపు వంక దాటి వెళ్లాలంటే చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్య వలన చాలా రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. ఈ సమస్య తీరాలంటే ముళ్లకంపలు తొలగించి, గుంతలు పూడ్చాలి. వాగుపై బ్రిడ్జి నిర్మిస్తేనే సమస్య తీరుతుందని రైతులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే



రైతులకు సబ్సీడీ పప్పు శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. కోడుమూరులోని వ్యవసాయాధికారి కార్యాలయంలో బుధవారం రైతులకు సబ్సీడీ కింద పప్పు శనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సబ్సీడీ శనగ విత్తనాలు 25శాతం సబ్సీడీతో రూ. 5850క్వింటాళ్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. సిఎం చంద్రబాబునాయుడు ముందు చూపు గల నాయకుడని ఎంతో అనుభవంతో రైతుల సంక్షేమం కొరకు పాటుపడే నాయకుడు అన్నారు. నిత్యం పేద, మధ్య తరగతి రైతుల సంక్షేమం కోసమే సిఎం చంద్రబాబు పరితపిస్తుంటారన్నారు. ఈ కార్యక్రమలలో మండల ఏఓ రవిప్రకాష్ గౌడ్, కోడుమూరు టిడిపి మండల కన్వినర్ అనుగొండ రామకృష్ణా రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎల్లప్ప నాయుడు, టిడిపి నాయకులు భాస్కర్, బలరాం, వర్కూరు అయ్యప్ప, పాలకుర్తి విజయ్ యాదవ్, గిడ్డయ్య, కృష్ణాపురం పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఉల్లి పంటను పరిశీలించిన ఎమ్మెల్యే :** మండలంలో రైతులు సాగు చేసిన ఉల్లి పంటలను కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి పరిశీలించారు. రాష్ట్రంలోనే కర్నూలు జిల్లాలో ఉల్లి పంటను అధికంగా పండిస్తారని ఉల్లి రైతులు నష్టపోకుండా కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన తెలిపారు. ఉల్లి పంట సాగుకు ఎంత పెట్టుబడి అవుతుంది, ఎంత దిగుబడి వస్తుంది అనే విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.



ఉల్లి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

# చేతి వృత్తులు నేర్చుకొని మహిళలు స్వశక్తివంతులు కావాలి

**– జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ మేనేజింగ్ కమిటీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి**



మహిళలకు సర్టిఫికేట్లు అందించిన రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్‌:** చేతి వృత్తులు నేర్చుకొని మహిళలు ఆర్థికంగా, స్వశక్తివంతులుగా ఎదగాలని జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ మేనేజింగ్ కమిటీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి అన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వెల్దుర్తి పట్టణంలో నివసిస్తున్న టైలరింగ్ సెంటర్లో టైలరింగ్ నేర్చుకున్న 40మంది మహిళలకు సర్టిఫికేట్లను వెల్దుర్తి తహశిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుధవారం వెల్దుర్తి డిప్యూటి తహశిల్దార్ గురుస్వామిరెడ్డి చేతుల మీదుగా జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ మేనేజింగ్ కమిటీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అందించారు. ఈ సందర్భంగా డిప్యూటి తహశిల్దార్ గురుస్వామిరెడ్డి మాట్లాడుతూ మహిళలు చేతివృత్తులు నేర్చుకోవడం ద్వారా తమ జీవితంలో కఠిన పరిస్థితికి గురికాకుండా జీవించగలుగుతారని, స్వతహాగా సంపాదించుకొని కుటుంబానికి ఆసరగా నిలుస్తారన్నారు. టైలరింగ్ వృత్తిలో ప్రతిభ ఎంతుంటే అంతటి సంపాధన ఉంటుందని, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ నేర్పించే మంచి సెంటర్ నడపడం చాలా అభినందించతగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ గౌరవ సభ్యులు జూలకంటి రఘునాథ్‌రెడ్డి, రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షులు గోవిందరెడ్డి, వెల్దుర్తి రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్ చైర్మన్ పోతులూరి ఆచారి, పరమేష్, చంద్రశేఖర్, సుంకన్న, శివకుమార్, టైలరింగ్ టీచింగ్ భాగ్యలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

# జలదుర్గం గ్రామాన్ని సందర్శించిన డోన్ ఆర్‌డిఓ



ప్రతిపాదనలను పరిశీలిస్తున్న డోన్ ఆర్‌డిఓ కెపి.నరసింహులు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్‌:** ప్యాపిలి మండల పరిధిలోని జలదుర్గం గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలనే ప్రతిపాదనలో భాగంగా బుధవారం డోన్ ఆర్‌డిఓ కెపి.నరసింహులు, ప్యాపిలి తహశిల్దార్ భారతిలు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను అడిగి వివరాలను సేకించారు.

# శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ బాధితునికి చెక్కు పంపిణీ




బాధితులకు చెక్కులను అందజేస్తున్న కంపెనీ అధికారులు

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా జనరల్ మేనేజర్ హరినాథ్‌రెడ్డి, రీజినల్ మేనేజర్ గిరిరాజు కుమార్, అటికెల గుండు గ్రామానికి చెందిన బోయ రాధికకు రూ.4, 50,000ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మృతుడు రెండు సంవత్సరాల పాటు రూ.32వేలు ప్రీమియం చెల్లించారని, సహాజ మరణం చెందడంతో వారికి చెక్కును అందజేసినట్లు తెలిపారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తమ పాలసీదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు ఎల్లప్పుడు వేగవంతమైన సేవలను అందిస్తున్నామన్నారు. పాలసీదారుల కుటుంబ సభ్యులకు సమయానికి క్లెయిమ్ మొత్తాలను చెల్లించడం ద్వారా కంపెనీ సామాజిక బాద్యతను నిర్వర్తిస్తుందని తెలిపారు. బాధితులు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ అండ్ డెవలప్మెంట్ అధికారి బాదామికృష్ణ, నారాయణరెడ్డి, పత్తికొండ మేనేజర్లు శంభులింగా, విజయ్ కుమార్, ధనుంజయలు పాల్గొన్నారు.

# సొంత నిధులు పెంపొందించుకొనేందుకు శిక్షణ



**చాగలమర్రి మేజర్ న్యూస్ :** సొంత నిధులను పెంపొం దించుకునేందుకు ప్రజల్లో అవగాహన తీసుకురావాలని ఎంపీడీవో తాహెర్ హుస్సేన్ కోరారు. బుధవారంచాగలమర్రి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు,డిజిటల్ అసిస్టెంట్లకు, మరియు ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ కు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించడమైనది ఈ శిక్షణా కార్యక్రమంలో గ్రామపంచాయతీ సొంత వనరులు ( సొంత నిధులు) పెంపొందించడానికి అనే అంశంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించడం అయినది. శిక్షణానంతరం శిక్షణ వచ్చిన వారికి సర్టిఫికెట్స్ ప్రధానం చేయడమైనది ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాహెర్ హుస్సేన్, టి ఓ టి లు సుజాత అన్సర్ భాష, పుల్లయ్య,

# సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడి సహించరానిది

**-ఎమ్మిగనూరు లో న్యాయవాదుల నిరసన**




**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ( సీజెఐ) బిఆర్ గవాయ్ పై న్యాయవాది కిషోర్ చెప్పు విసిరి దాడికి యత్నించడం ప్రజాస్వామ్యానికి తీరని మచ్చ అని ఎమ్మిగనూరు న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రషీదుల్లా ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం ఎమ్మిగనూరు న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిజెఐ పై దాడికి నిరసనగా స్థానిక సోమప్ప సర్కిల్ లో ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా రసీదుల్లా మాట్లాడుతూ దేశ లౌకిక పునాదిని కూల్చేసి న్యాయవ్యవస్థను మతపరమైన ఆట బొమ్మ గా మార్చటానికి ప్రయత్నించే వారి చర్యలు పరాకాష్టకు చేరాయి.ఇది కేవలం గవాయ్ పై జరిగిన దాడి మాత్రమే కాదు భారత దేశ రాజ్యాంగం పై జరిగిన దాడి గా భావించాలి.న్యాయస్థానం దేవుని కోట కాదు. న్యాయమూర్తి మత గురువు కాదు.న్యాయవ్యవస్థ ఏకైక లక్ష్యం చట్టాన్ని కాపాడటమే.మన రాజ్యాంగం ప్రకారం ఏ మతానికి ప్రాంతానికి అనుకూలం,వ్యతిరేకం గా ఉండదు.ఖజురాహో ఆలయ విగ్రహ పునరుద్ధరణ పిటిషన్ ను సిజెఐ గవాయ్ కొట్టివేటడం లౌకిక సూత్రానికి నిదర్శనం.ఆ సమస్య ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) చట్ట పరిధిలోకి వస్తుందని చెప్పడం న్యాయపరైన విధి. న్యాయమూర్తిని భయపెట్టడం అంటే ప్రజాస్వామ్యం పతనం అవుతుందని గుర్తుంచుకోవాలి.గవాయ్ కు అండగా ఉంటూ న్యాయవ్యవస్థను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదుల బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆనంద్, వాల్మీకి రామకృష్ణ నాయుడు, మురళీకృష్ణ,ఓ నారాయణ,నాగన్న, రంగనాథ్,పార్లపల్లి మల్లికార్జున, బోయ శ్రీనివాసులు నాయుడు, మహబూబ్ భాష, ఏసోబు,కే మల్లికార్జున, ఇర్షద్ అహ్మద్, రమణ( సామెల్), తవాబ్,గౌడ్ పాల్గొన్నారు.